# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

# Bullet Edition

మంగళవారం, 2 జులై 2024 www.prajaaswaramdaily.com 2PM


## దీక్ష విరమించిన మోతిలాల్ నాయక్



సికింద్రాబాద్, జూలై 2 (ప్రజాస్వరం): నిరుద్యుగుల డిమాండ్ల కోసం గాంధీ ఆస్పత్రిలో గత తొమ్మిది రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్న మోతిలాల్ నాయక్ తన దీక్షను విరమించారు. కొబ్బరినీళ్లు తాగి దీక్షను విరమించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిరుద్యుగుల డిమాండ్ల కోసం గత తొమ్మిది రోజులుగా దీక్ష చేస్తున్నానని.. తొమ్మిది రోజుల దీక్షలో ఒక్క ఉద్యోగం కూడా పెరగలేదన్నారు. ఇన్నిరోజులు అన్న పానియాలు లేకుండా ఆమరణదీక్ష చేశానన్నారు మోతిలాల్. తన ఆరోగ్యం సరిగ్గా లేదని.. క్రియాటిన్ లేవల్స్ పెరిగి.. కిడ్నీ, లివర్లు పాడయ్యే పరిస్థితికి వచ్చిందని చెప్పుకొచ్చారు. ఇతర రాష్ట్రల పెత్తనం పోయిన మన బతుకు మారలేదని మోతిలాల్ ఆవేదన వ్యక్తం చేశారు. 25 నుంచి 35 సంవత్సరాల వయసు యువత ఉద్యోగాల కోసం కళ్ళు కాయలు కాసేలా ఎదురు చూస్తున్నారన్నారు. కొత్త ప్రభుత్వం రాగానే... తమ డిమాండ్లు పరిష్కరిస్తామని చెప్పారని కానీ ఆ దిశగా అడుగులు మాత్రం పడలేదని మండిపడ్డారు. రేపటి నుంచి ఉద్యోగాల కోసం తీవ్ర పోరాటం చేస్తామని చెప్పిప మోతిలాల్.. 50 వేల ఉద్యోగాలు ఇచ్చే వరకు ఉద్యమాన్ని తీవ్రం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం జీవోలను రిలీజ్ చేసే వరకు ఉద్యమిస్తామని తెలిపారు.

## ఈ నెల 6న
## చంద్రబాబు.. రేవంత్ భేటీ



హైదరాబాద్, జూలై 2 (ప్రజాస్వరం): తెలుగు రాష్ట్రాల ముఖ్య మంత్రుల భేటీకి రంగం సిద్ధం అయ్యింది. రాష్ట్ర విభజన జరిగి పదేళ్లు పూర్తైనా.. ఇంకా రెండు రాష్ట్రాల మధ్య అపరిష్కృ తంగా మిగిలిన అంశాలపై చర్చించేందుకు సీఎం చంద్రబాబు చొరవ తీసుకున్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డికి ఏపీ సీఎం చంద్రబాబు లేఖ రాశారు. 6వ తేదీన మీరున్న చోటుకే వస్తానని లేఖలో ప్రస్తావించారు. చంద్రబాబు లేఖపై రేవంత్ రెడ్డి నుకూలంగా స్పందించారు. చంద్రబాబు లేఖపై రేవంత్ రెడ్డి లేఖ రాసే అవకాశం ఉంది. అన్ని సవ్యంగా జరిగితే ఈనెల 6వ తేదీన రెండు రాష్ట్రాల ముఖ్యమంత్రుల సమావేశం జరగనుంది. ప్రజా భవన్‌లోనే ఇద్దరు భేటీ అయ్యే అవకాశం ఉంది. విభజన అంశాలు, అపరి ష్కృత అంశాలపై చర్చించే అవకాశం ఉంది.విభజన అంశాలపై కూర్చొని మాట్లాడుకుంటే.. ఎంత ఝటిలమైన సమస్య అయినా సమసిపోతుందని చంద్రబాబు లేఖలో ప్రస్తావించారు. మరి దశాబ్ద కాలంగా అపరి ష్కృతంగా మిగిలి ఉన్న సమస్యలు ఓ కొలిక్కి రానున్నాయా..? సీఎం హోదాలో చంద్రబాబు, రేవంత్ రెడ్డి తొలి సమా వేశం ఎలా జరగనుంది..? అనే అంశం ఇప్పుడు రెండు రాష్ట్రాల రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఆంధ్రప్రదేశ్ పునర్విభజన జరిగి పదేళ్లు పూర్తైంది. ఆస్తుల విభజనకు సంబంధించిన అనేక అంశాలు ఇంకా పెండింగ్ లోనే ఉన్నాయి. ఢిల్లీలోని ఏపీ భవన్, పటౌడీ హౌజ్, నర్సింగ్ హాస్టల్‌ను మాత్రమే విభజిస్తూ ఈ ఏడాది మార్చి 15న కేంద్ర హోం శాఖ నిర్ణయం తీసుకొంది. దీనికి రెండు రాష్ట్రాలూ అంగీకరించాయి. కీలకమైన తొమ్మిది, పది షెడ్యూళ్లలోని ఆస్తులను విభజించాల్సి ఉంది. వాస్తవానికి ఈ రెండు అంశాలే తెలుగు రాష్ట్రాలకు ముఖ్యం కానున్నాయి. మరి రెండు రాష్ట్రాల సీఎంల భేటీలో వీటిపై ఏమేరకు క్లారిటీ వస్తుందో వేచి చూడాలి మరి.

## సెల్ఫీ వీడియో తీసుకుంటూ
## పురుగులమందు తాగి..



ఖమ్మం, జూలై 2 (ప్రజాస్వరం): ఖమ్మం జిల్లా చింతకాని మండలం ప్రొద్దుటూరుకు చెందిన బోజెడ్ల ప్రభాకర్ (45) కుటుంబానికి 7.10 ఎకరాల వ్యవసాయ భూమి ఉంది. గ్రామంలోని చెరువు శిఖం పక్కనే ఉన్న తన భూమిలో ప్రభాకర్ గత వేసవిలో రూ.8 లక్షలు వెచ్చించి మట్టి తోలించాడు. అయితే చెరువు శిఖంలో మట్టి పోశారంటూ గ్రామానికి చెందిన మత్స్య సొసైటీ సభ్యులు నాలుగు రోజుల క్రితం రెండు జేసీబీలు, రెండు బుల్డోజర్లతో ప్రభాకర్ పొలంలోని మట్టిని తొలగించారు. దీనిపై తహసీల్దార్, ఎస్సై, ఇరిగేషన్ అధికారులకు ప్రభాకర్ ఫిర్యాదు చేయగా ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు భూమిని పరిశీలించి మట్టి తొలగించొద్దని సొసైటీ సభ్యులకు చెప్పారు. అయినా వారు దౌర్జన్యంగా మట్టి తొలగించగా, గ్రీవెన్స్ లో కలెక్టర్, సీపీని కలిసి తనకు జరిగిన అన్యాయంపై ఫిర్యాదు చేసేందుకు తన తండ్రితో కలిసి ప్రభాకర్ సోమవారం ఖమ్మం కలెక్టరేట్ కు వెళ్లాడు. అక్కడ కలెక్టర్ కలవకపోవడంతో మనస్తాపానికి గురైన ప్రభాకర్.. భోజనం చేసి వస్తానంటూ తండ్రితో చెప్పి ఖమ్మంలోని గొల్లగూడెం–కొత్తగూడెం మార్గంలో గల చెరుకూరి గార్డెన్ వద్దకు పురుగుల మందు డబ్బాతో చేరుకున్నాడు. తనకు జరిగిన అన్యాయాన్ని సెల్ఫీ వీడియో ద్వారా వివరిస్తూ పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. స్థానికుల ద్వారా సమాచారం తెలుసుకున్న 108 సిబ్బంది ఆ ప్రాంతానికి వెళ్లగా అప్పటికే మృతి చెందాడు. గ్రామంలోని కొందరు కాంగ్రెస్, టీడీపీ నాయకుల ప్రోద్బలంతోనే తన పొలాన్ని నాశనం చేశారని వివరిస్తూ తాను ఆత్మహత్య చేసుకునే ముందు తీసిన వీడియోను సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్కకు పంపించాలని, తన కుటుంబానికి న్యాయం జరిగేలా చూడాలని ప్రభాకర్ కోరాడు.



# కిలోమీటరుకు 10 వేలు

## గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో రోడ్లపై రద్దీ
## ఐదేళ్లలో 35 శాతం పెరిగిన వాహనాలు
## 2019లో కిలోమీటరుకు 6,500
## అర కోటికి పైగా బైకులు.. 14,82,028 కార్లు

హైదరాబాద్, జూలై 2 (ప్రజాస్వరం) గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని రోడ్లపై రోజురోజుకు వాహనాల సంఖ్య పెరిగిపోతున్నది. పర్సన్ వాహనాల కొనుగోలుకే ప్రజలు మొగ్గు చూపుతుండడంతో.. ఐదేండ్లలో వాహనాల అమ్మకాలు విపరీతంగా పెరిగిపోయాయి. దీని ద్వారా రవాణా శాఖకు పన్నుల ద్వారా ఆదాయం సమకూరుతున్నప్పటికీ రోడ్లను విస్తరించకపోవడంతో నగర ప్రజలు ట్రాఫిక్ ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాలుష్యం సైతం పెరిగిపోతున్నది. ప్రజా రవాణాను కూడా ఆయా శాఖలు పట్టించుకోకుపోవడంతో అవి సత్ఫలితాలనివ్వడం లేదుగ్రేటర్ హైదరాబాద్ సుమారు 800 కిలోమీటర్ల మెయిన్ రోడ్డును కలిగి ఉన్నది. 2019 లో ప్రతి కిలోమీటరుకు 6,500 వాహనాలు మాత్రమే ఈ రోడ్లపై తిరుగుతుండేవి. 2024 నాటికి ఈ సంఖ్య 35 శాతం పెరిగి 10 వేలకు చేరుకున్నది. ఇందులో ఏడు వేల ద్విచక్ర వాహనాలు, 1900 కార్లు ఉన్నట్లు గుర్తించా రు. 2019లో నగర రోడ్లపై సగటున 54 లక్షల వాహనాలు తిరుగుతుండగా.. ఈ సంఖ్య ప్రస్తుతం 80 లక్షలకు చేరుకున్నది. రవాణా శాఖ లెక్కల ప్రకారం నగరంలో 59 లక్షల ద్విచక్ర వాహనాలు, 14.3 లక్షల కార్లు ఉన్నాయి. నగరంలో ఉదయం 8.30 గంటల నుం చి 11 గంటల వరకు రోడ్లపైకి ట్రాఫిక్ రద్దీ అధికంగా ఉంటున్నది. రవాణా శాఖ లెక్కల ప్రకారం రంగారెడ్డి జిల్లా కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయం పరిధిలో ప్రతిరోజు సగటున 1500 కొత్త వాహనాలు రిజిస్ట్రేషన్ కు వస్తున్నాయి. రెండేళ్ల క్రితం ఈ సంఖ్య వెయ్యి లో పే ఉండేది. దీన్ని బట్టి కొత్త వాహనాల సంఖ్య ఎంత పెరిగిపోయిందో అర్థం చేసుకోవచ్చు.జీహెచ్ఎంసీ పరిధిలో 72 కిలోమీటర్ల మేర మెట్రోను 2017లో అందుబాటులో తీసుకువచ్చారు. దీంతో నగరంలో ట్రాఫిక్, కాలు ష్యం సమస్య తగ్గుతుందని అంతా భావించా రు. అయితే పరిస్థితుల్లో ఎలాంటి మార్పు రా లేదు. గ్రేటర్ పరిధిలో ప్రజా రవాణా చేసే ఆ ర్టీసీ, మెట్రో, ఎంఎంటీఎస్ మధ్య సమన్వయం లోపించినట్లు కనిపిస్తున్నది. మెట్రో స్టేషన్లకు వచ్చే ప్రయాణికుల కోసం చుట్టు పక్కల కాలనీల నుండి మినీ బస్సులను ఏర్పాటు చేస్తున్నట్లు గతంలో ఆర్టీసీ ప్రకటించింది. కొన్ని రోజులపాటు సిటీ బస్సులను నడిపినా తర్వాత వాటిని నిలిపివేయడంతో సమస్య మొదటికొచ్చింది. దీంతో ప్రజలు మెట్రో స్టేషన్లకు వ్యక్తిగత వాహనాల మీద వస్తున్నారు. ఇలా రద్దీ సమయంలో వాహనాలన్నీ రోడ్లకెక్కుతుండడంతో ట్రాఫిక్ సమస్య జఠిలంగా మారుతున్నది. ఇప్పటికైనా ప్రజారవాణా చేసే శాఖలు సమన్వయంతో పని చేసి వ్యక్తిగత వాహనాలు రోడ్ల మీదకు రాకుండా మెరుగైన సదుపాయాలు కల్పించాలని నగరవాసులు కోరుతున్నారు.

**గ్రేటర్ పరిధిలో వాహనాల సంఖ్య ఇలా..**

| | |
|---|---|
| ఈ కార్ట్ | 41 |
| ప్రైవేట్ సర్వీస్ వెహికల్స్ | 2,274 |
| కాంట్రాక్ట్ క్యారేజ్ | 6,835 |
| స్టేజ్ క్యారేజెస్ | 8,569 |
| విద్యా సంస్థల బస్సులు | 14,624 |
| మ్యాక్సీ క్యాబ్‌లు | 15,754 |
| ఇతర వాహనాలు | 40,421 |
| ట్రాక్టర్ అండ్ ట్రాలీస్ | 45,806 |
| మోటార్ క్యాబ్ | 79,609 |
| ఆటో రిక్షా | 1,07,862 |
| గూడ్స్ క్యారేజెస్ | 3,14,359 |
| మోటార్ కార్స్ | 14,82,028 |
| మోటార్ సైకిల్స్ | 59,25,468 |



## తెలంగాణ నయాగరా

తెలంగాణ నయాగరాగా పిలిచే ములుగు జిల్లా వాజేడు మండలంలోని బొగత జలపాతం అందాలు పర్యాటకులకు కనువిందు చేస్తున్నాయి. ఛత్తీస్గఢ్ అడవుల్లో ఆదివారం రాత్రి కురిసిన వర్షంతో చీకుపల్లి వాగు ఉద్ధృతంగా ఉప్పొంగుతోంది. దీంతో పెద్దఎత్తున వరద నీరు జలపాతంలోకి చేరుతోంది. ఉవ్వెత్తున ఎగిసిపడుతున్న నీటి తుంపర్లలో పర్యాటకులు తడిసిముద్దవుతున్నారు. వరదనీటి ప్రవాహానికి తోడు జలపాతం హోరు దట్టమైన అటవీ ప్రాంతంలో ప్రతిధ్వనిస్తోంది. సోమవారం వరంగల్, హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో ప్రజలు తరలివచ్చారు.

-వాజేడు , జూలై 2 (ప్రజాస్వరం)

accident

## స్కూల్ బస్సు బోల్తా.. క్లీనర్ మృతి

కావలి, జూలై 2 (ప్రజాస్వరం): శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లాలో ఘోర రోడ్డు ప్రమాదం చోటు చేసుకుంది. ఆర్ఎస్ఆర్ ఇంటర్నేషనల్ స్కూల్ బస్సును లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో బస్సు క్లీనర్ అక్కడికక్కడే మృతి చెందగా, 15 మంది చిన్నారులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన కావలి దగ్గర జాతీయ రహదారిపై చోటుచేసుకుంది. స్థానికులు గాయపడిన వారిని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న వెంటనే విద్యార్థుల తల్లిదండ్రులు ఆస్పత్రికి చేరుకున్నారు. పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని ప్రమాదం జరిగిన తీరును పరిశీలించారు. ప్రమాద సమయంలో స్కూల్ బస్సులో ఎంతమంది ఉన్నారనేది తెలియాల్సి ఉంది. ప్రమాదానికి గల కారణాలపై పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ ఘటనకు డ్రైవర్ నిర్లక్ష్యమా? అతివేగమా? అన్న కోణాల్లో పోలీసులు విచారణ చేస్తున్నారు. బాధితులను మంత్రి నారా లోకేష్ పరామర్శించారు.

